క్లుప్తంగా

బాల్య మిత్రుడి వైద్యానికి రూ.60 వేల సాయం


క్యాన్సర్‌తో బాధపడుతున్న సుదర్శనరాజు

హిరమండలం: సుమారు 35 ఏళ్ల క్రితం తమతోపాటు కలిసి చదువుకున్న బాల్యమిత్రుడు వైద్యం కోసం (1986–93) పూర్వ విద్యార్థులు రూ.60వేల ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. హిరమండలం మండల కేంద్రానికి చెందిన వైశ్యరాజు సుదర్శనరాజు పలాసలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో చిరుద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల క్యాన్సర్ బారీనపడి విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం బాల్య మిత్రుడు వారణాశి రాజారెడ్డికి తెలిసింది. రాజారెడ్డి తన బాల్య స్నేహితులతో సుదర్శన్‌రాజు విషయమై చర్చించారు. తమవంతు సహాయంగా రూ.60 వేలను సుదర్శన్‌రెడ్డికి అందజేశారు. దాతలు ముందుకు వచ్చి క్యాన్సర్‌తో బాధపడుతున్న సుదర్శన్‌రాజును ఆదుకోవాలని, ఫోన్ పే నంబర్ 9502017494, జీపే నంబర్ 8143008838లను సంప్రదించాలని కోరారు.

60 శాతం సబ్సిడీపై దాణామృతం


పాడిరైతులకు అందజేస్తున్న దాణామృతం

సరుబుజ్జిలి: పాడి రైతులకు ప్రభుత్వం 60 శాతం సబ్సిడీపై సమీకృత దాణామృతం అందజేస్తోందని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డెరెక్టర్ సి.హెచ్.సుబ్రహ్మణ్యం తెలిపారు. పాడి రైతులకు సబ్సిడీపై అందిస్తున్న సమీకృతదాణామృత కార్యక్రమాన్ని గురువారం షళంత్రిలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షళంత్రి ఎంపీటీసీ సభ్యుడు సూర్యనారాయణ, పశువైద్యాధికారి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే పల్లె ప్రగతి


మాట్లాడుతున్న ఎంపీడీఓ మురళీమోహన్‌కుమార్

సరుబుజ్జిలి: పల్లెలు సమగ్రాభివృద్ధి జరగాలంటే అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పనిచేయాలని ఎంపీడీఓ మురళీమోహన్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మన ఇల్లు – మన గౌరవం, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల అమలపై అధికారులతో సమీక్షనిర్వహించారు. ప్రతీ పంచాయతీ పరిధిలో ప్రజలకు సంబంధించిన అన్ని రకాల మౌలిక వసతుల కల్పన దిశగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ ఆనందరావు, సూపరింటెండెంట్ వరప్రసాద్, ఎస్‌బీఎం మండల కో ఆర్డినేటర్ నందివాడ రమణబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కేజీబీవీ విద్యార్థినులు

పొందూరు: మండలంలోని లోలుగు కేజీబీవీ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.రూపవతి గురువారం తెలిపారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. అండర్–14 విభాగంలో షాట్‌పుట్‌లో డి.హాసిని మొదటి స్థానం, అండర్–17 విభాగంలో కె.జానకి డిస్కస్ త్రోలో మూడో స్థానం, ఎం.ద్రాక్ష షాట్‌పుట్‌లోనూ, డిస్కస్ త్రోలోనూ మొదటి స్థానంలో నిలిచారు. వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రంజిత్

పోలాకి: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పోలాకి ఎస్ఐ జి.రంజిత్ హెచ్చరించారు. గురువారం ఈదులవలస జంక్షన్‌లో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రత, ప్రజారవాణా బాధ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇటీవల ఆటో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండటంతోపాటు పోలాకి కేంద్రంగా కొందరు ఆటో డ్రైవర్లు దురుసు ప్రవర్తన పోలీసుల దృష్టికివ చ్చిన నేపథ్యంలో ఈసమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఆటోల్లో లౌడ్‌స్పీకర్లు, మితిమీరిన ప్రయాణీకులు, మద్యం తాగి ఆటో నడపడం వంటి వాటిని తీవ్రంగా పరిగణిస్తామన్నారు.

• జలమయం


బజారు వీధిలో చేరిన నీరు


ఆదివరపుపేట చివర రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

నరసన్నపేట మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మెయిన్ రోడ్డుతోపాటు బజారు వీధి, వజ్రంపేట, ఆదివరపుపేట, శివనగర్ కాలనీల్లో వరద నీరు చేరింది. స్థానికులు ఇబ్బంది పడ్డారు. వర్షం పడిన ప్రతిసారీ ఇదే ఇబ్బంది అవుతుందని, నీరు నిల్వ లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

– నరసన్నపేట

• గోతులమయం




ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గల ఏబీ రోడ్డు. భారీ గుంతలు ఏర్పడడంతో ఏమాత్రం వర్షం కురిసినా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తరచూ ప్రమదాల బారిన పడుతున్నారు. మండలంలోని పలు ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. రాకపోకలకు ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు.

– సరుబుజ్జిలి

రైతన్నల్లో కలవరం

- రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- ఇప్పటికే పెట్టుబడి పెట్టేసిన అన్నదాతలు
- నిండుగా ఉన్న చెరువులు, కాలువలు


లక్ష్మీనర్సుపేట ప్రాంతంలో స్వల్ప కాలిక వరి పంట


కోవిలాం ప్రాంతంలో ఖరీఫ్ వరిసాగు

ఎల్.ఎన్.పేట: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను కలవర పెడుతున్నాయి. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో పంటల పరిస్థితి ఏమిటా అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగునీటి చెరువులు నిండు కుండల్లా దర్శనమిస్తున్నాయి. మరోవైపు సాగునీటి కాలువలు నిండుగా ప్రవహిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వర్షాలు కురిస్తే పంట నీట మునిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాహతకు మించి అప్పలు చేసి పంటకోసం పెట్టుబడి పెట్టామని ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియని దుస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ వరి పంట ప్రస్తుతం పొట్ట దశకు చేరుకుంది. మరో నెల 15 రోజుల్లో పంట చేతికి అందివస్తుందని రైతులు చెబుతున్నారు.

ఎన్ను దశలో స్వల్పకాలిక వరి పంట..

పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సాగు చేస్తున్న స్వల్పకాలిక వరి పంట ప్రస్తుతం ఎన్ను దశకు చేరుకుంది. మరో 20 రోజులు ఆగితే స్వల్ప కాలిక వరి కోతలు పూర్తవుతాయని రైతులు చెబుతున్నారు. ఈ దశలో వర్షాలు నష్టపరిచేలా ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలోని లక్ష్మీనర్సుపేట, బసవరాజుపేట, వాడవలస, దబ్బపాడు, మిరియాపల్లి, అంబావల్లి, అక్కరాపల్లి, రెల్లివలస, భగీరథపురం, మాకనాపల్లి, పెద్ద పద్మాపురం, కొసమాల, సీది, తామర, తీమర, చంగుడి, సరాలి, కమలమ్మ కొట్టు, కొరసవాడ, బూరగాం, కాగువాడ, జోగిపాడు, వెంకటాపురం, ఆర్.కె.పురం, మదనాపురం, గురండి తదితర గ్రామాల్లో స్వల్పకాలిక వరి పంటను పండిస్తున్నారు.

78వేల ఎకరాల్లో వరిసాగు..

నియోజకవర్గంలోని ఐదు మండలాలో సుమారు 45 వేల మంది రైతులు 78 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సుమారు మూడు నెలకు పైగా గడిచిపోయింది. పొలాలు దుక్కిలు, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, కలుపు నివారణ వంటి ఖర్చులతో పంట పెట్టుబడి కోసం ఇప్పటికే ఎకరానికి రూ.20వేలకు పైగా పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు.

ప్రభుత్వ సాయంపై నమ్మకం లేదు



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే తుఫాన్ కారణంగా వర్షాలు కురిశాయి. మొక్క దశలో ఉన్న పంట పొలాలు సుమారు పది రోజులపాటు నీట మునిగాయి. నీట మునిగిన చేను కుళ్లిపోయింది. అధికారులు వచ్చి పంటలు పరిశీలించారు. విత్తనాలు ఇస్తామని చెప్పి వెళ్లిపోయారు. కొందరు రైతులు విత్తనాలు వద్దు సాయం చేయాలని కోరారు. ఇప్పటివరకు ఈ ప్రభుత్వ ఒక్క రూపాయి కూడా సాయం చేలేదు.

– చింతాడ ఆదినారాయణ, రైతు, ధనుకువాడ, ఎల్.ఎన్.పేట

అవగాహన కలిగిస్తున్నాం



తుఫాన్ కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పొలాల్లో నీరు నిల్వ లేకుండా పల్లం ప్రాంతాలకు విడిచి పెట్టాలని తెలియజేశాం. స్వల్పకాలిక వరి పండించే వారికి కూడా అవగాహన కలిగిస్తున్నాం. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తిచేశాం.

– పైడి లతశ్రీ, ఏఓ, ఎల్.ఎన్.పేట

వైఎస్ జగన్‌ను కలిసిన పద్మజ



మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలో ఆమదాలవలసకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు బొడ్డేపల్లి పద్మజ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమదాలవలస నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై చర్చించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

– ఆమదాలవలస

తమ్మినేనికి అభినందనలు


తమ్మినేనికి అభినందనలు తెలుపుతున్న నాయకులు

ఆమదాలవలస: శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ నియోజకవర్గ పరిశీలకునిగా నియమితులైన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను పొందూరు మండలాని చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఆయన ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు లోలుగు శ్రీరాములు నాయుడు, గంట్యాడ రమేష్, చింతాడ ప్రసాద్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొంచడ రమణమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాడన సునిల్, వాండాన సూరపు నాయుడు, గుడ్ల మోహన్ తదితరులు ఉన్నారు.

గో సంరక్షణ అందరి బాధ్యత


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు, పెద్దలు

హిరమండలం: గో సంరక్షణ అందరి బాధ్యత కావాలని గో సంరక్షణ రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ, హిరమండలం జెడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు పిలుపునిచ్చారు. ప్రేమ సాయి వృద్ధాశ్రమంలో గురువారం గో సంరక్షణ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. పశువుల అక్రమ రవాణాను ఎవరైనా అడ్డుకోవచ్చన్నారు. పాడి పశువులను కాపాడుకోలేకపోతే భవిష్యత్ తరాలకు మనం విషంతో కూడిన పాలను అందించేవారం అవుతామని ఆందోళన వ్యక్తం చేశారు. హిరమండలంలో గోశాల ఏర్పాటుకు చర్యలు తీసుకంటామని జెడ్పీటీసీ అన్నారు. ఈ సందర్భంగా గో సంరక్షణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. హిరమండలం మాజీ సర్పంచ్ అంధవరపు అబ్బాయి, ఎస్.సాయిబాబా, కోరాడ మురికిరాజు, సాల కృష్ణవేణి, జామి జనార్దనరావు, ప్రసాదరావు, అంధవరపు శ్రీనివాసరావు, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయురాలిని కోల్పోయాను

ఆమదాలవలస: ఒంగోలు మాజీ ఎంపీ, కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతితో ఆత్మీయురాలిని కోల్పోయానని ఆమదాలవలస మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి గురువారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. పార్వతమ్మ మృతి ఆ ప్రాంత ప్రజలకు తీరని లోటన్నారు. ఎంతోమంది స్నేహితులకు తీరని ఆవేదన కలిగిస్తోందని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

జలుమూరు: సీజనల్ వ్యాధులైన జ్వరం, దగ్గు, జలుబు తదితర వాటిపై అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ మెడికల్ అధికారి చల్ల వంశీకృష్ణ అన్నారు. గురువారం కరవంజ పంచాయతీ మట్టిపేటలో ఆరోగ్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీనికి ముందు పంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. తాగునీటి బావులలో క్లోరినేషన్ చేయించి, వీధులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ యు.చిన్నరాజులు, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఆరోగ్యకార్యకర్త లక్ష్మీభాయ్, ఆరోగ్య సహాయకుడు రవి, సిబ్బంది పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ


అలుదులో అన్నపూర్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కృష్ణచైతన్య, నాయకులు

సారవకోట: మండలంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య గురువారం పరామర్శించారు. మాకివలసకు చెందిన రావాడ జగన్నాథం, అన్నుపురం గ్రామానికి చెందిన తాడేల జయమ్మ, అలుదు గ్రామానికి చెందిన రేగేటి అన్నపూర్ణమ్మ మృతి చెందారు. ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, సర్పంచ్ సాగిపల్లి దండాశి, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, కత్తిరి అప్పలనాయుడు, జగన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ


తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: విద్యార్థుల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. మండలంలోని కోరాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అందజేశారు. విద్యార్థుల చదువుల పట్ల ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతీ విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం కరణం నాగరాజు, ఉపాధ్యాయులు పి.జయమ్మ, సీఆర్‌ఎంటీ ధనుంజయరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి రీ సర్వే సమస్యలు


ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రసాదరావు, రైతులు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామంలో భూముల రీ సర్వేలో జరిగిన అక్రమాలపై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో రైతులు తీసుకువెళ్లారు. తప్పులను సరిచేయాలని కోరుతూ గురువారం వినతి పత్రం అందజేశారు. భూముల రీ సర్వే విషయాన్ని తహసీల్దార్ పాపారావును ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. రైతులు ఇచ్చిన వినతుల మేరకు రీ సర్వేలో జరిగిన తప్పులు సరిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రీ సర్వేలో రైతులకు జరిగిన అన్యాయాన్ని జేసీ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

అధికారుల తీరువల్లే నష్టపోయాం

- అచ్చనాపురం గిరిజనుల ఆవేదన


వంశధార ఈఈకి సమస్యలు వివరిస్తున్న అచ్చనాపురం గిరిజనులు

మెళియాపుట్టి: గిరిజనులమని చిన్నచూపుతోనే తమకు కొంతమంది అధికారులు అన్యాయం చేశారని అచ్చనాపురం గిరిజనులు ఆరోపించారు. 2008లో తమ గ్రామాన్ని నిర్వాసిత గ్రామంగా పరిగణలోకి తీసుకున్నారని, 44 కుటుంబాలుంటే ఒకే కుటుంబానికి పరిహారం అందించారన్నారు. ఇప్పుడేమో తమ గ్రామం రిజర్వాయర్ పరిధిలోకి రాలేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని వంశధార ఈఈ శేఖర్ వద్ద వాపోయారు. గురువారం టెక్కలి వంశధార ఈఈ గ్రామాన్ని సందర్శించి గిరిజనులతో మాట్లాడారు. అచ్చనాపురం నిర్వాసిత గ్రామం కాదని, పరిహారాలు అందించలేదు సరికదా గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న ఇళ్లు కట్టుకుందామంటే రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్లు సైతం ఇవ్వడంలేదని, బ్యాంకుల్లో లోన్లు కూడా ఇవ్వడం లేదని గ్రామానికి చెందిన పలువురు వాపోయారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ధరలు పెరిగిపోయాయని, ఇళ్ల నిర్మాణాలు ఎలా చేపట్టాలని, తమకు న్యాయం చేయాలని కోరారు. భూములు సేకరించిన వాటికి సైతం అతి తక్కువ పరిహారం ఇచ్చారని, డీ–పట్టా భూములకు ఎటువంటి పరిహారం అందించలేదన్నారు. ఇదే ప్రాజెక్ట్‌లో దాసుపురం, చీపురుపల్లి గ్రామాలకు చెందిన వారికి ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీలు 2013 చట్టం ప్రకారం అందించారన్నారు. అచ్చనాపురం నిర్వాసితులకు మాత్రం తక్కువ పరిహారాలకు ఇవ్వడం బాధాకరమన్నారు. కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ ఇలా అధికారుల చుట్టూ తిరిగి, తిరిగి అలసిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఈఈ శేఖర్ స్పందిస్తూ.. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యాకే ఆఫ్‌షోర్ కాలువ పనిచేస్తామని హామీ ఇచ్చారు. పొజిషన్ సర్టిఫికెట్లు జారీ అయ్యేలా చూస్తామన్నారు. తహసీల్దార్ ఎన్.హనుమంతరావు, ఆర్ఐ వైకుంఠరావు, వీఆర్వో అప్పలనాయుడు, గిరిజన సంఘం నేతలు చొక్కారావు, వరహాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసు


మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

పొందూరు: మైనర్లను బైక్ డ్రైవింగ్‌కు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులపై తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు సత్ప్రవర్తనపై అవగాహన కల్పించారు. సుప్రీం కోర్టు ఆదేశానుసారం మైనర్లు డ్రైవింగ్‌చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేవారిపైనా కేసులు పెడతామన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. పెద్దలను గౌరవిస్తూ, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా నేర్చుకుంటే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. హెచ్‌ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.10 వేల ఆర్థికసాయం


వంశీకి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న యువకులు

మెళియాపుట్టి: మండలంలోని హీరాపురం గ్రామానికి చెందిన తిప్పాన వంశీ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పలువురు యువకులు గురువారం రూ.పది వేల ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో దుక్క బాలరాజు, సవర రామ్మూర్తి, లక్ష్మీపురం కిరణ్, పలువురు యువకులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభం



స్కౌట్‌కు ఎంపికైన విద్యార్థులతో కమిషనర్, సిబ్బంది

జలుమూరు: కరవంజ మోడల్ స్కూల్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ జి.బుజ్జిబాబు గురువారం ప్రారంభించారు. దీని ఆవశ్యతను విద్యార్థులకు వివరించారు. స్కౌట్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు రక్షణశాఖతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఉంటాయన్నారు. విద్యార్థి దశ నుంచి జాతీయ సేవా కార్యక్రమాలపై అవగాహన కలుగుతుందన్నారు. స్కౌట్‌లో పలు శారీరక పరీక్షలు నిర్వహించి ఎంపికైన విద్యార్థులకు దుస్తులు, ఇతర ఉపకరణాలు అందించారు. డ్రిస్టిక్ కమిషనర్ రోవర్, ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్, సీనియర్ పీజీటీ గుంట లక్ష్మీనారాయణ, గైడ్ కెప్టెన్ పి.మాధవి, స్కౌట్ మాస్టర్ రివాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే


దాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కొత్తూరు: మండలంలోని మహసింగిలో ఉన్న శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో గురువారం ఫ్రెషర్స్ డే ఉత్సహంగా సాగింది. విద్యార్థులు పలు జానపద, సినీ పాటలకు నృత్యం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలు ఆలోజింపచేశాయి. ఈ సందర్భంగా విద్యా సంస్థల కారస్పాండెంట్, డైరెక్టర్‌లు జి.సుధారాణి, కృష్ణరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమశిక్షణతో మెలిగిన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు

పాతపట్నంలో భారీ వర్షం


పాతపట్నంలో కురుస్తున్న వర్షం

పాతపట్నం: మండలంలో గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్ర వరకు భారీ వర్షం కురిసింది. పాతపట్నం మండల కేంద్రంతో సుమారు మూడు గంటలపాటు ఏకధాటిగా వర్షం పడింది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రహదారులన్నీ జలమైయ్యాయి. కొరసవాడ, కాగువాడ, పెద్దసీది, రొంపివలస, గంగువాడ, ఆర్.ఎల్.పురం తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మహేంద్రతనయ నదిలో నీరు పెరుగుతోంది.

కందకాల తవ్వకం


కందకాల పనులు పరిశీలిస్తున్న ఏపీఓ రవి

మెళియాపుట్టి: కొండచుట్టూ కందకాలు తవ్వడం వల్ల అనేక రకాల లాభాలు ఉన్నాయని ఉపాధి హామీ ఏపీఓ టి.రవి అన్నారు. గురువారం మామిడిగుడ్డి గ్రామంలో కందకాల పనులను పరిశీలించారు. వీటి ద్వారా వర్షంనీరు వరదగా గ్రామాల్లోకి రాకుండా అరికట్టడమే కాకుండా.. కందకాలలో నిల్వ ఉన్ననీరు అడవిలో నివసించే ప్రాణులకు తాగడానికి ఉపయోగపడతాయన్నారు. నీటిని ఇంకింపజేయవచ్చని తెలిపారు. నాణ్యతతో కందకాలు తవ్వాలని వేతనదారులకు సూచించారు. అవకాశమున్న చోట అన్ని గ్రామాలలోనూ కందకాల పనులు చేయాలన్నారు. పలువురు వేతనదారులు పాల్గొన్నారు.